# అంతరాత్మ

డాక్టర్ మనోహరం లోపలకు వస్తూనే "ఎలా వుంది?" అనడిగాడు.

రామరాజు ఏమీ చెప్పలేకపోయాడు.

ఇద్దరూ గదిలోకి వెళ్లే సరికి కస్తూరి కళ్లు మూసుకుని పడుకుని వుంది.

"కస్తూరీ" చిన్నగా పిలిచాడు రామరాజు.రెండోసారి పిలిచిన తర్వాత కస్తూరి కళ్లు తెరిచింది.

ఎదురుగా డాక్టర్ నిల్చుని నవ్వుతూ ఆమెను చూశాడు. "ఎలా వుంది?" అడిగాడు ఆమెను.

కస్తూరి పెదవులను చిన్నగా కదిల్చింది. కానీ ఎటువంటి శబ్దమూ బయటకు రాలేదు.

"బాగా నీరసంగా వుంది" అన్నాడు రామరాజు.

టెంపరేచర్ చూశాడు మనోహరం.

"ఎలా వుంది డాక్టర్?" అడిగాడు రామరాజు ఆత్రంగా.

"ఇప్పుడే నార్మల్‌కు వస్తోంది. ఈ సాయంత్రానికి పూర్తిగా తగ్గిపోతుంది. ఈ మందులు వాడండి" అని మందులు రామరాజుకు ఇచ్చి వెళ్లిపోయాడు.

బయట గేటు వేసి తిరిగి లోపలకు వచ్చేసరికి కస్తూరి కళ్లు తెరుచుకునే వుంది. పైన తిరక్కుండా ఆగివున్న ఫ్యాన్‌ని చూస్తూ పడుకుంది.

రామరాజు ఆమె దగ్గరగా వచ్చి నుదుటిమీద చెయ్యివేసి "ఇంకా వెచ్చగానే వుంది కస్తూరీ" అన్నాడు.

"ఆమె మాట్లాడలేదు. భర్తని అదోలా చూసింది.

రామరాజు అక్కడే కూర్చుని బత్తాయిలు కోసి రసం తీస్తూ "కస్తూరీ..నువ్వేం భయపడకు..సాయంత్రానికల్లా జ్వరం పూర్తిగా తగ్గిపోతుందని డాక్టరు గారు చెప్పారు" అన్నాడు.

అప్పుడు కూడా ఆమె మాట్లాడలేదు.

రసాన్ని గ్లాసులో పోసి ఆమె పక్కనే కూర్చుని ఆమె తలని తన ఒడిలో వుంచుకుని

ఆమెచేత చిన్నగా తాగించాడు.

"ఎలా వుంది?" ఆమె పడుకున్న తర్వాత ఆమె తల వెంట్రుకలను సవరిస్తూ అడిగాడు రామరాజు.

అప్పుడు కూడా కస్తూరి మాట్లాడలేదు. రామరాజు కళ్ళలోకి చూసింది కాంతిలేని కళ్లతో..

"నీకు విశ్రాంతి కావాలి కస్తూరీ! నిద్రపో" అని రామరాజు ఆరోజు దినపత్రిక తీసుకుని మంచం పక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

కస్తూరి పేపరు చదువుతున్న అతన్నే కన్నార్పకుండా చూస్తూ వుండిపోయింది.

"నిజంగా తనంత అదృష్టవంతురాలు వుంటుందా?" ఆలోచిస్తోంది ఆమె.

ఎందుకో మధ్యలో రామరాజు పేపరు చదవడం ఆపి భార్యను చూశాడు.

ఆమె కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి.

"ఏడుస్తున్నావా?" దగ్గరగా జరిగి అడిగాడు.

ఆమె పెదవులను కదిల్చి ఏదో అనబోయింది.

కానీ ఒక్కమాట కూడా బయటకు రాలేదు. తిరిగి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"కస్తూరీ భయపడకు. నీకేమీ కాదు. పూర్తిగా తగ్గిపోతుంది..నేను లేనా?" ఆమె భుజం మీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు.

ఈసారి ఆమె పెద్దగానే ఏడ్చింది.

"తప్పు..ఏడవకు. చిన్నపిల్లలా ఏమిటిది?"

అతనే ఆమె పమిటచెంగుతో కస్తూరి కన్నీళ్లు తుడిచాడు. ఆమె ఏడుపు ఆపింది.

అతను గడియారం చూసుకున్నాడు. ఒక టాబ్లెట్ తీసి ఆమెచేత మింగించాడు. గొంతువరకు దుప్పటి కప్పి తిరిగి కుర్చీలో కూర్చున్నాడు పేపరు చదువుతూ.

కస్తూరి కళ్లు మూసుకుంది.

కళ్లు మూసుకునే ఆలోచిస్తోంది.

ఆమెకు నాలుగురోజులు క్రితం తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆరోజునుంచీ రామరాజు ఆమెను అంటిపెట్టుకుని వుంటున్నాడు. ప్రతినిమిషం ఆమెను శ్రద్ధగా గమనిస్తూనే వున్నాడు. డాక్టరు ఇచ్చిన మందులను దగ్గరుండి ఆమెకు ఇస్తున్నాడు.

ఈ దేశంలో ఎంతమంది భర్తలు-భార్యలకిలా సేవలు చెయ్యగలరు? అనుకుంది కస్తూరి.

నిజంగానే తను అదృష్టవంతురాలు. పదిహేడేళ్ల క్రితం తన పెళ్లి జరిగింది. ఆరోజు నించీ భర్త తనని ప్రేమగానే చూసుకుంటున్నాడు. అప్పుడప్పుడు ఇంటి సమస్యలో, ఆఫీసు సమస్యలో వచ్చినప్పుడు తనమీద విసుగును ప్రదర్శించటం తప్పించి ఇన్నేళ్ల

తన వివాహ జీవితంలో ఎప్పుడూ ఆయన తనని తిట్టలేదు. తనవల్ల కొన్ని పొరపాట్లు జరిగినా సగటు సాధారణ భర్తల్లా నిందించలేదు.

తనమీద చెయ్యి చేసుకోలేదు. భార్యలను కొట్టే మగవాళ్లంటే ఆయనకు అసహ్యం.

నాలుగు రోజులక్రితం వచ్చిన జ్వరం గురించి తను అంతగా పట్టించుకోలేదు. ఏదో మామూలు జ్వరమనే అనుకుంది. ఒకటి రెండు గంటల్లోనే ఆ జ్వర తీవ్రత పెరిగిపోయింది. అప్పటినించీ తను మంచంమీదనే వుండిపోయింది.

ఇంట్లో ఇద్దరు మగపిల్లలు వున్నారుగానీ వాళ్లవల్ల ఎటువంటి ఉపయోగమూ లేదు.

నిద్ర లేచింది మొదలు ట్యూషన్లూ, స్కూలూ రాత్రి ఎప్పుడో వస్తారు.

తను మంచాన పడిందగ్గర్నుంచీ అన్నీ ఆయనే చూసుకుంటున్నాడు.

ఒక్కసారి కళ్లు తెరిచి భర్తను చూసింది కస్తూరి. పేపరు చదువుతూనే వున్నాడు.

కస్తూరిని మళ్లీ భర్త గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి.

మూడునెల్ల క్రితం నుంచీ భర్తలో తనపట్ల పెరిగిన ప్రేమ ఆమెకు పదేపదే గుర్తుకు వస్తోంది. ఎందువల్లనో ఆయన తనంటే ఎక్కువ ప్రేమ చూపుతున్నాడు.

తనకు సంబంధించిన ప్రతి విషయం గురించీ ఆయన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నాడు.

తను సుఖంగా వున్నదా? లేదా? సంతోషంగా వుంటున్నదా? లేదా? అన్నీ గమనిస్తున్నాడు.

తను మొదట్లో తెలుసుకోలేదు. పెళ్లయిన పదిహేడేళ్ల తర్వాత తనపట్ల ఆయన ప్రేమ మరింత పెరిగిపోయింది.

ఎందువల్లనో గానీ ఆయన తన కనులకు కొత్తగా అనిపిస్తున్నాడు.

ఆ సంఘటన కస్తూరికి గుర్తుకొస్తోంది.

అవును..తను పక్కింటి వసుంధరతో కలిసి సిల్కుషోరూమ్‌కు వెళ్లింది. వసుంధర మూడు చీరలు కొన్నది. తనకు ఒక్క చీర కూడా కొనే ఉద్దేశ్యం లేదు. వసుంధరకు తోడుగా వెళ్లింది.

కానీ ఓ చీర తనకు బావుంటుందనీ తనని కొనుక్కోమని అన్నది వసుంధర.

కానీ తను ఒప్పుకోలేదు.

అవసరమైతే డబ్బు ఇస్తానంది వసుంధర. చీర కొనకుండానే తను ఇంటికి తిరిగి వచ్చింది.

ఆ రాత్రి ఆ చీర గురించి భర్తతో చెప్పింది.

ఆయనేమీ మాట్లాడలేదు.

మరుసటిరోజు ఆఫీసునించి తిరిగివస్తూ ఆ చీరను కొని తీసుకువచ్చాడు.

తన ఆశ్చర్యానికి అంతులేదు.

రెండు నెలల క్రితం ఎదురింటి వనజాక్షి ఓ నెక్లెస్ చేయించుకుంది. ఇంట్లో ఆయన వున్నప్పుడే వచ్చి ఆ నెక్లెస్‌ని చూపించింది.

అది చాలా బావుంది. "అన్నయ్యనడిగి నువ్వు కూడా ఇలాంటిది చేయించుకో..నీకైతే ఇంకా బావుంటుంది" అని చెప్పి వెళ్లిపోయింది.

"నీకూ చేయించమంటావా?" అడిగాడాయన.

"వద్దులెండి..ఇప్పుడు మన దగ్గర డబ్బుల్లేవుగా"

"డబ్బుల గురించి నీకెందుకు? నిజంగానే ఆ నెక్లెస్ నీకు బావుంటుంది"

"మీ ఇష్టం" అన్నది.

అంతే. ఆయన ప్రావిడెంట్‌ఫండ్ లోనుపెట్టి నెక్లెస్ చేయించాడు.

వయసు పెరుగుతున్నకొద్దీ మనుషుల్లో ప్రేమ పెరుగుతుందా? అందుకే ఆయన ఈ మూడునెల్ల నుంచీ తననింకా ప్రేమగా చూసుకుంటున్నాడా? నాలుగు రోజులనించీ నిద్రకూడా మాని తనకిన్ని సేవలు చేస్తున్నాడా? అదే నిజమైతే ఆయనమీద తనకున్న ప్రేమ పెరగలేదేం? ఏమో!

ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది కస్తూరి.

000

"ఇప్పుడు నాకొంచెం బాగానే వుంది. మీరు ఆఫీసుకు వెళ్లండి" అన్నది కస్తూరి.

"పోనీ...ఈ ఒక్కరోజు ఇంట్లోనే వుంటాను. నువ్వు ఇంకా నీరసంగానే వున్నావు" అన్నాడు రామరాజు.

"వద్దులెండి. ఇప్పటికే చాలా రోజులు నా గురించి, ఇంట్లోనే బందీగా వున్నారు. అన్ని పనులూ చేసుకోగలను. అవసరమైతే పక్కింటి అమ్మాయి తులసి సహాయం తీసుకుంటాను" అన్నది.

"నీ ఇష్టం"

చివరికి రామరాజు ఆఫీసుకు వెళ్లేటప్పుడు కూడా కస్తూరి, "నేనెంతో అదృష్టవంతురాలిని" అన్నది.

"నాకేదయినా అయితే ఈపాటి సేవలు నువ్వు చెయ్యవా?" అన్నాడు అదోలా భార్యను చూసి.

సాయంత్రం ఆఫీసునుంచి నా గురించి ఎర్లీగా రాకండి..ఇన్నాళ్లూ అలసిపోయారు. కొంచెం బయట గాలి పీల్చుకురండి" అన్నది నవ్వుతూ.

000

రామరాజు ఆఫీసునించి సరాసరి సుజాత ఇంటికి వచ్చాడు.

"ఇన్నాళ్లూ ఎక్కడికి వెళ్లావ్? అసలు కనపడటం లేదు" అన్నది సుజాత.

కస్తూరి జ్వరం గురించి చెప్పాడతను.

"నువ్వింకా ఏ వూరో వెళ్లావనుకున్నాను. ఇప్పుడెలావుంది నీ భార్యకి" అంది.

చెప్పాడు.

"భార్యంటే నీకు బాగానే ప్రేమ" కొంచెం అసూయగా అన్నది సుజాత అతని ఎదురుగా కుర్చీలో కూర్చుని.

"మూడునెలల క్రితం కలిసిన నీ మీదనే ఇంత ప్రేమ పదిహేడేళ్ల క్రితం నేను మూడుముళ్లూ వేసిన నా భార్యమీద అంత ప్రేమ వుండటంలో ఆశ్చర్యం ఏముంది సుజీ" అన్నాడతను.

"భార్యమీద అంత ప్రేమ వున్నవాళ్లు ఈ సుజీ కోసం ఎందుకు వస్తున్నారో" అన్నది చిన్నగా నవ్వుతూ.

ఎందుకంటే..సాధారణంగా వయసు పడమటికి జారిపోతున్న కొద్దీ చాలామంది మనుషుల్లో జీవితాన్ని అనుభవించాలనే ఆదుర్దా, తాపత్రయం మొదలవుతాయి.

అందుకే నేను నీ ఆకర్షణకు లొంగిపోయాను. ప్రలోభానికి గురయ్యాను.

కానీ నాకో అంతరాత్మ వుంది. నేను నా భార్యకు అన్యాయం చేస్తున్నానని అది ఘోషిస్తూనే వుంది. నేను చేస్తున్న పని తప్పని నాకు ప్రతినిమిషం చెబుతూనే వుంది. అందుకే, ఆ అంతరాత్మని తృప్తి పరచటానికి, నేను నా భార్యకు చేస్తున్న అన్యాయానికి పరిహారంగా ఆమెను ఇదివరకటికంటే ఇప్పుడింకా ఎక్కువ ప్రేమగా చూసుకుంటున్నాను.

జారిపోతున్న వయసును నీకూ పంచటానికి నేను నీ దగ్గరకు వస్తున్నాను. ఏమైనా మనిషికి అంతరాత్మ లేకపోతే అతనొక మృగం-

ఇలా అనుకున్నాడు రామరాజు సుజాతను దగ్గరకు తీసుకుంటూ.

*(స్వాతి సపరివారపత్రిక 20-6-1997)*